# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా
బుధవారం । 29 । జనవరి । 2025






### బాబు ప్రజలను మోసం చేశారు
రాష్ట్ర ప్రజలు చంద్రబాబును నమ్మి అధికారమిస్తే ఆయన ఘోరంగా మోసం చేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు. -8లో



### పంజాబ్ ఘన విజయం
వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన కల్నల్ సీకే నాయుడు అండర్-23 అంతర్ రాష్ట్రాల మ్యాచ్‌లో పంజాబ్ విజయం సాధించింది. -8లో

### వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.2/16.6

జిల్లాలో మంగళవారం 16.6 - 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 30లోపు ఫీజు చెల్లించాలి
కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల సౌకర్యార్థం తత్కాల్ -2 కింద పరీక్ష ఫీజు చెల్లింపునకు ఇంటర్మీడియట్ బోర్డు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ప్రకటించిందని ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎవరైనా పరీక్ష ఫీజు చెల్లించని వారు ఉంటే గడువులోపు చెల్లించాలని పేర్కొన్నారు. తత్కాల్ ఫీజు రూ.3000 రూపాయలు, పరీక్ష ఫీజు రెండు కలిసి ఆయా కళాశాలల లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని చెప్పారు. తత్కాల్-2లో పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులందరూ కూడా జిల్లా కేంద్రంలో పరీక్ష రాయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

### సెమిస్టర్ ఫలితాలు విడుదల

సిబ్బందితో కలిసి సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ జి. విశ్వనాథ కుమార్

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వై.ఎస్.ఆర్ ఆర్కిటెక్చర్ , ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని 9, 1వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసీ ఆచార్య జి. విశ్వనాథ కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన తక్కువ సమయంలో ఫలితాల విడుదలకు కృషి చేసిన సిబ్బందిని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి జి. ఫణీంద్ర రెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయప్రకాష్ రెడ్డి, నారపరెడ్డి పాల్గొన్నారు.

### జంబోరి వేడుకలకు విద్యార్థులు
రాయచోటి జగదాంబసెంటర్: తమిళనాడులోని తిరుచురాపల్లిలో నిర్వహించనున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరి వేడుకలకు అన్నమయ్య జిల్లా స్కౌట్స్ విద్యార్థులు వెళ్లారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల నుంచి 25 వేల మంది హాజరుకానున్నారు.

### తాగునీటి పథకం పరిశీలన

తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం సమీపంలోని బహుళ గ్రామీణ తాగునీటి పథకాన్ని మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ పరిశీలించారు. తాగునీటి పథకం నిర్వహణను పరిశీలించి, అందులో లోటుపాట్లపై ఆరా తీశారు. పథకం నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు వారు కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. డీఈలు శివరుద్రగౌడ్, కిరణ్, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఈఓపీఆర్డీ రంగయ్య, మేనేజర్ ఈశ్వరాచారి, ఏఓమల్లికార్జున పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలం పార్టీకి!

- కోట్ల రూపాయాలు నేతల జేబుల్లోకి!
- ఆర్అండ్‌బీ స్థలాన్ని టీడీపీకి అప్పగించిన ఎమ్మార్వో
- రేకుల షెడ్లును తొలగించి ఇనుము ఎత్తుకెళ్లిన టీడీపీ నేతలు
- అందులో ఉన్న తుప్పు బట్టిన వాహనాలు, స్క్రాప్ స్వాహా
- అధికారులకు తెలియకుండానే రూ.2కోట్లు విలువైన ఐరన్ తరలింపు


ఆర్అండ్‌బీశాఖకు చెందిన బిల్డింగ్‌లు


రెవెన్యూ యంత్రాంగం అప్పగించగానే నేలమట్టం చేసిన టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, కడప: అధికారం ఉంది, అప్పనంగా దండుకుందాం... ఇదే స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తోంది. ఈమేరకు ప్రభుత్వ ఉత్తర్వులతో కడప నగరంలోని కోట్లాది రూపాయాలు విలువైన భూమి పార్టీ వశమైంది. పెద్దల ఆదేశాలు వచ్చిందే తడవుగా రెవెన్యూ అధికారులు భూమిని అప్పగిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వులు చేతిలో పడగానే అందులో ఉన్న ఉన్న స్క్రాప్, ఐరన్, తుప్పుబట్టిన వాహనాలన్నీ తెలుగుతమ్ముళ్ల వశమయ్యాయి. వేలు.. లక్షలు కాదు.. లక్షణంగా రూ.2కోట్లు విలువైన ఐరన్ సొమ్ము నేతల జేబుల్లోకి వెళ్లాయి.

- కడప నగరం అక్కాయపల్లె పార్కు సమీపంలో నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆఫీసు వెనుక వైపు యువతకు శిక్షణ ఇచ్చేందుకు న్యాక్ కార్యాలయం ఉండేది. ఎకరం రూ.40కోట్లు విలువైన ఆ ప్రభుత్వ భూమి 2ఎకరాలు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం 99 ఏళ్లకు లీజుకు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే, వెంటనే కడప తహశీల్దార్ నారాయణరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డికి స్థలాన్ని అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**పట్టుబట్టి అప్పగించిన వైనం...**
2014-19 టీడీపీ సర్కార్ హయాంలో అదే స్థలాన్ని జిల్లా టీడీపీ కార్యాలయానికి కేటాయిస్తూ అప్పటి చంద్రబాబు సర్కార్ నిర్ణయం తీసుకుంది. అప్పట్లో కార్పొరేషన్ పాలకమండలి పార్కుకే కేటాయిస్తూ తీర్మాణం చేయడం, ఆపై హైకోర్టుకు వెళ్లి స్టేటస్ కో ఉత్తర్వులు తీసుకొచ్చారు. అప్పట్లోనే కోట్లాది రూపాయాలు విలువైన ఆ స్థలం టీడీపీ వశం కాకుండా రాజకీయ పక్షాలన్నీ ఏకమయ్యాయి. తాజాగా టీడీపీ అధికారిక పగ్గాలు అందుకోగానే ఏకంగా మంత్రివర్గ తీర్మాణం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాయానికి దాదాపు రూ.80కోట్లు విలువైన స్థలాన్ని అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ అండ్‌బీ అధికారులకు తెలియకుండానే రెవెన్యూ యంత్రాంగం టీడీపీకి అప్పగించడం గమనార్హం. మరోవైపు అందులో ఉన్న ఐరన్ ఇతర తుప్పుబట్టిన వాహనాలను టీడీపీ నేతలు రాత్రికి రాత్రే స్వాహా చేశారు.

### ఈఈ పరిధిలోనే ఉందన్న ఎస్ఈ
టీడీపీ నేతలు రాత్రికి రాత్రే నేలమట్టం చేసి కోట్లాది రూపాయాలు విలువైన ఐరన్ తరలించుకెళ్లిన విషయాన్ని గురించి ఆర్అండ్‌బీ ఎస్ఈ చంద్రశేఖర్‌ను సంప్రదిస్తే తుప్పుబట్టిన వాహనాలు, ఐరన్ స్క్రాబ్ ఇవన్నీ కూడా కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కనుసన్నుల్లో ఉన్నాయని ఎస్ఈ తెలిపారు. అదే విషయాన్ని ఈఈ నాగేశ్వర రెడ్డితో వాకబు చేస్తే తమకు తెలియకుండానే తహశీల్దార్ తెలుగుదేశం పార్టీ నేతలకు అప్పగించారని, ఐరన్, స్క్రాబ్ ఎక్కడున్నాయో తెలియదన్నారు.అదే విషయాన్ని తహశీల్దార్ నారాయణరెడ్డిని ప్రశ్నించగా, ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు వ్యవహరించామన్నారు. కాగా అందులో ఉన్న ప్రభుత్వ బిల్డింగ్‌లు, ఐరన్ గురించి జిల్లా అధికారులు పట్టించుకోలేదు. ప్రజాధనంపై అధికారులు ఎంతటి బాధ్యతరాహిత్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు టీడీపీ నేతలు బాధ్యతరాహిత్యంగా ప్రవర్తించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన కోట్లాది రూపాయాలు విలువైన స్క్రాబ్‌ను అధికారులు రికవరీ చేస్తారో లేదో చూడాలి.


అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

# బ్రహ్మోత్సవం.. ప్రారంభం

కడప రాయుడు కప్పురపు రాయుడయ్యాడు. బ్రహ్మాండ నాయకుడు బ్రహ్మోత్సవ కళను సంతరించుకున్నాడు. పరిసరాలన్నింటికీ కొత్త పరిమళాలను సంతరించి పెట్టాడు. జిల్లాకే తలమానికంగా నిలిచే తిరుమల వాసుని ప్రతిరూపంగా కడప గడపను దివ్యంగా వెలిగిస్తూ అంతటా ఉత్సవ శోభను కల్పించాడు. నేటి నుంచి పది రోజులపాటు రోజుకో వాహనంపై సూర్యప్రభ తేజంతో వెలిగిపోనున్నాడు.


అంకురార్పణను తిలకిస్తున్న భక్తులు

### భక్తిశ్రద్ధలతో అంకురార్పణ
కడప కల్చరల్: కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్‌లతో పాటు మరికొందరు వేద పండితులు దీక్షా తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విశ్వక్సేనునికి పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. సాయంత్రం రక్షా కంకణధారణ నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్ట మట్టిని పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అంకురార్పణ నిర్వహించారు.ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించిన అంకురార్పణ కార్యక్రమాన్ని తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. టీటీడీ నుంచి వచ్చిన సూపరింటెండెంట్ హనుమంతయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్యుల కీర్తనలను ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. చివరగా హరికథా కాలక్షేపం నిర్వహించారు.

**నేడు ధ్వజారోహణం**
బ్రహ్మోత్సవాల్లోభాగంగా బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల్లోపుగా తిరుచ్చి, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో ఊంజల సేవ నిర్వహిస్తారు. ఇదే సమయంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు స్వామిపై కీర్తనలు ఆలపించనున్నారు. రాత్రి 6.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామిని కొలువుదీర్చనున్నారు.

## నిర్మాణంలోని పాఠశాల తనిఖీ
చింతకొమ్మదిన్నె: మండలంలోని జె.కొత్తపల్లి వద్ద నాడు-నేడు నిధులతో నిర్మాణం జరుగుతున్న అదనపు తరగతి గదులను, పాఠశాల స్థలాన్ని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. అలాగే సెంట్రల్ కిచెన్ ఏర్పాటుకు వసతులను పరిశీలించి ప్రధానోపాధ్యాయుడిని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చింతకొమ్మదిన్నెలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన ఏర్పాట్లు, వసతులు గురించి కలెక్టర్ ఆరా తీశారు. రీసర్వే జరుగుతున్న పెద్దకాంపల్లి గ్రామ పొలాల వద్దకు వెళ్లి అధికారులను, ప్రజలను అడిగి రీసర్వే జరుగుతున్న తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. కలెక్టర్ పర్యటనలో చింతకొమ్మదిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావు,ఇతర అధికారులు పాల్గొన్నారు.


జె.కొత్తపల్లె నిర్మాణంలోని పాఠశాల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

## మేకల పెంపకం లాభదాయకం
బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ టి.రామాపురం సమీపంలో నిర్మించిన నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(జాతీయ ఉత్పత్తి పెంపకం) పథకం కింద రూ.కోటితో నూతనంగా నిర్మించిన ఎస్ఎస్ మేకల పెంపకం ఫాంను మంగళవారం రాష్ట్ర పశు సంవర్ధశాఖ అదనపు సంచాలకులు డా.వెంకటరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ.. పశు సంవర్ధశాఖ సూచనల మేరకూ మేకల పెంపకం చేపట్టాలన్నారు. షెడ్ నిర్వహణలో ఏమాత్రం అశ్రద్ధ చేయిద్దన్నారు. పశు సంవర్ధశాఖ జేడీ శారదమ్మ, డీఎల్‌డీఏ శివరామిరెడ్డి, ఏడీ పాల్గొన్నారు.

## పక్కాగా 'ఈ-ఆఫీస్'
కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, టైపిస్టులు, సిబ్బందికి ఈ-ఆఫీస్ నిర్వహణపై ఎన్ఐసీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-ఆఫీస్ ఆచరణలో లేని శాఖలు అందుకు సంబంధించిన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే సమకూర్చుకోవాలన్నారు. జిల్లా ఇన్ఫర్మేషన్ అధికారి డాక్టర్ టీఆర్ విజయ్ కుమార్, ఈ-ఆఫీస్ టెక్నికల్ అసిస్టెంట్స్ శ్రీనివాసరావు, అనిల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు


# రీ సర్వేత్రా సమస్యలే?

- సమస్యల పరిష్కారం ప్రశ్నార్థకం?
- క్షేత్రస్థాయిలో సిబ్బందికి తప్పని ఇబ్బందులు



కడప సెవెన్‌రోడ్స్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లాలో భూముల రీ సర్వే మళ్లీ ప్రారంభమైంది. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ల డిప్యుటేషన్లు, వీఆర్వోలు ఒక బ్లాక్‌కే పరిమితం కావడం, భూమి రికార్డుల స్వచ్ఛీకరణ సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో రీ సర్వే సవ్యంగా జరగడం ప్రశ్నార్థకంగా మారింది.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. జిల్లాలో ఫేజ్-1లో 86 గ్రామాల్లో 98478.83 ఎకరాలు, ఫేజ్-2లో 99 గ్రామాల్లో 132442.40 ఎకరాలు, ఫేజ్-3 కింద 98 గ్రామాల్లో 225356.17 ఎకరాల్లో రీ సర్వే నిర్వహించారు. మొత్తం 282 గ్రామాల్లో 456277.4 ఎకరాల్లో రీ సర్వే కార్యక్రమం సవ్యంగా ముగిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలల తర్వాత ఇప్పుడు రీ సర్వే కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. జిల్లాలో మండలానికి ఒక గ్రామం చొప్పున 35 మండలాల్లో భూముల రీ సర్వే జరుగుతోంది. గ్రామాలను బ్లాకులుగా విభజించారు. ఒక్కో బ్లాక్ 250 ఎకరాలకు మించకుండా ఉండాలి. ప్రతి బ్లాక్‌కు ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏ ఉంటారని అధికారులు ప్రకటించారు. అయితే జిల్లాలోని కొన్ని గ్రామాల్లో నాలుగు బ్లాకులు ఉన్నాయనుకుంటే ఒక్క వీఆర్ఓ మాత్రమే ఉన్నారని తెలుస్తోంది. వీఆర్వోను ఒక బ్లాక్‌కే పరిమితం చేస్తే మిగతా బ్లాకుల్లో సమస్యలు ఎదురైనపుడు ఎవరు అందుబాటులో ఉంటారనే ప్రశ్న తలెత్తుతోంది. మరోవైపు భూముల యజమానుల సమక్షంలోనే రీ సర్వే నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కొందరు ఇతర ప్రాంతాల్లో ఎక్కడో ఉద్యోగమో, వ్యాపారమో చేసుకుంటూ ఉంటారు. దీంతో వారు రాలేని పక్షంలో హద్దుల గుర్తింపు సమస్యగా మారే అవకాశం ఉంటుంది. వీడియో కాల్ చేసి హద్దులు చూపెడతామని అధికారులు అంటున్నా అది ఆచరణలో ఎంత వరకు అమలవుతుందో చూడాలి.
- క్షేత్ర స్థాయిలో తలెత్తే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే ఉద్దేశ్యంతో నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మొబైల్ కోర్టులను సైతం ఏర్పాటు చేసింది. అందుకు ఒక రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌ను కూడా నియమించింది. కానీ ప్రస్తుతం రీ సర్వే డీటీలంతా డిప్యుటేషన్లపై జిల్లాలో వివిధ చోట్ల పనిచేస్తున్నారు.

### పకడ్బందీగా రీ సర్వే

జిల్లాలో రీ సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. గతంలో 285 గ్రామాల్లో రీ సర్వే జరిగింది. మిగతా 635 గ్రామాల్లో రీ సర్వే జరగాల్సి ఉంది. ప్రస్తుతం మండలానికి ఒక గ్రామం చొప్పున 35 మండలాల్లో రీ సర్వే ప్రారంభించాం. ఎవరైనా భూ యజమాని అందుబాటులో లేకపోతే వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసి గట్లు చూపెడతాం. డిప్యుటేషన్లపై ఉన్న రీ సర్వే డీటీలనుకూడా పంపుతాం.
- కె.మురళీకృష్ణ, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి,

### డిప్యుటేషన్లపై రీ సర్వే డీటీలు
మైదుకూరు రీ సర్వే డీటీ అంకాలయ్యను సీకే దిన్నెకు బదిలీ చేసి అక్కడున్న వేణుగోపాల్‌ను కడపకు పంపారు. అంకాలయ్యను డిప్యుటేషన్‌పై జాయింట్ కలెక్టర్ సీసీగా నియమించారు. సీకే దిన్నెలోభూముల విలువ అధికంగా ఉంటుంది గనుక సమస్యలు కూడా అధికమే. ఈ పరిస్థితుల్లో రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు రీ సర్వే డీటీ కూడా ఉండాల్సిన అవసరం ఉంది. ఏదైనా దూరం మండలాలకు చెందిన డీటీలను సీసీగా నియమించుకుని ఉంటే బాగుండేదంటున్నారు. కడప రీ సర్వే డీటీగా నియమించిన చక్రధర్ డిప్యుటేషన్‌పై కలెక్టరేట్ డి-సెక్షన్‌లో పనిచేస్తున్నారు. అలాగే పోరుమామిళ్ల రీసర్వే డీటీ రాజశేఖర్‌రెడ్డి, పెండ్లిమర్రి రీ సర్వే డీటీ సునీల్ కూడా డిప్యుటేషన్‌పై కలెక్టరేట్‌లో ఉన్నారు. ఇక మరో రీ సర్వే డీటీ నరసింహప్రసాద్ చాలాకాలంగా కడప ఆర్డీఓ సీసీగా కొనసాగుతున్నారు. జిల్లాలో ఇంకాపలువురు రీ సర్వే డీటీలు వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఇలా వీరంతా ఇతర ప్రాంతాల్లో పనిచేస్తుంటే రీ సర్వే పనులు కుంటుపడే ప్రమాదం ఉంటుంది. రీ సర్వేలో సమస్యలు వస్తే పరిష్కరించేందుకు రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దార్ ఉంటారని ఉన్నతాధికారులు చెబుతున్నా.. రోజువారి కార్యకలాపాల్లో తలమునకలై ఉండే రెగ్యులర్ డీటీలు రీ సర్వే పనులు ఎలా చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక జిల్లా కేంద్రమైన కడప చుట్టుప్రక్కల మండలాలకు చెందిన ఆర్ఐలను కూడా డిప్యుటేషన్లపై తరలించడం వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అంటున్నారు. రీ సర్వేలో ఇన్ని లోపాలున్నప్పుడు ఈ కార్యక్రమం ఎలా ముందుకు సాగుతుందనే ప్రశ్న అందరిలోనూ ఉత్పన్నమవుతోంది.


కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రికి వచ్చిన బాలసుబ్బయ్య

ఈ ఫొటోలోని వ్యక్తి పేరు బాలసుబ్బయ్య. బి.మఠం మండలంలోని నరసన్నపల్లె స్వగ్రామం. 100 శాతం చూపు లేదు. పైగా షుగర్ ఉంది. కరోనా సమయంలో వ్యాధిని అశ్రద్ధ చేయడంతో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఈ క్రమంలో ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించగా చూపు పూర్తిగా తగ్గిందని, ఇక చూపు రావడం కష్టమని వైద్యులు తెలిపారు. బాలసుబ్బయ్యకు దివ్యాంగుల పింఛన్ వస్తోంది. తాజాగా సచివాలయ అధికారులు ఫోన్ చేసి సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ చేయించుకొని రమ్మని చెప్పడంతో వచ్చాడు. 'పూర్తిగా కళ్లు కనిపించని నా కళ్లకు ఎన్నిసార్లు పరీక్షలు చేసినా ఏముంటదయ్యా'అని అంటున్నాడు.


సహాయకురాలితో వస్తున్న నరసింహులు

ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు నరసింహులు. బి మఠం మండలంలోని గుండాపురం నుంచి వచ్చాడు. సుమారు 7 ఏళ్ల నుంచి కళ్లు పూర్తిగా కనిపించలేదు. కుటుంబ సభ్యుల తోడు లేనిదే బయటికి వెళ్లలేడు. నరసింహులుకు 4 ఏళ్ల నుంచి దివ్యాంగుల కోటాలో పింఛన్ వస్తోంది. పింఛన్‌ను తీసేస్తారేమోననే కలవరపడుతున్నాడు. చూపు లేని కారణంగానే దివ్యాంగుల కోటాలో పింఛన్ తీసుకుంటున్నాను. మళ్లీ ఎందుకు పరీక్షలు చేస్తున్నారో అర్థం కావడం లేదంటున్నాడు.

# దేవుడా.. ఇవేం కష్టాలు

- రీ వెరిఫికేషన్ పేరుతో మళ్లీ వైకల్య నిర్ధారణ పరీక్షలు
- 100 శాతం చూపు లేని వారికి కూడా పరీక్షలు
- కూటమి ప్రభుత్వ చర్యలతో విస్తుపోతున్న పింఛన్‌దారులు


పేర్లు నమోదు చేయించుకుంటున్న దివ్యాంగులు, వారి సహాయకులు



జిల్లా ఆసుపత్రికి వచ్చిన దివ్యాంగులు

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రిలో సదరం పునఃపరిశీలనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక వైద్యులు కాకుండా కడప రిమ్స్ వైద్యులు వీరికి పరీక్షలు చేస్తున్నారు. దివ్యాంగుల కోటాలో పింఛన్ పొందుతున్న వారికి ప్రభుత్వం వారి సదరం సర్టిఫికెట్లను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు జిల్లా ఆస్పత్రికి వచ్చారు. పూర్తిగా కళ్లు కనిపించని వారు, మంచాన పడ్డ వృద్ధులను సైతం పరీక్షల కోసం వెళ్లాలని అధికారులు చెప్పడంతో కుటుంబ సభ్యుల సాయంతో వారంతా అతికష్టం మీద ఆస్పత్రికి వచ్చారు. జిల్లా ఆస్పత్రిలో రెండు రోజుల నుంచి రీ అసెస్‌మెంట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు సోమవారం బి మఠం మండలానికి చెందిన దివ్యాంగుల కోటా కింద పింఛన్ పొందుతున్న వారు రాగా, రెండో రోజు మంగళవారం మధ్యాహ్నం నుంచి చాపాడు మండలంలోని గ్రామాల దివ్యాంగులు వచ్చారు. సదరం పునఃపరిశీలనా శిబిరంలో తగు సౌకర్యాలు లేకపోవడంతో అనేక అగచాట్లు పడుతున్నారు. కనీసం కూర్చోడానికి చైర్లు ఏర్పాటు చేయనందున వృద్ధులు, ఇతర దివ్యాంగులు అవస్థలు పడ్డారు.

**వందల మందికి ఒకరే ఆడియాలజిస్టు**
ఈఎన్‌టి విభాగంలో సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ చేయించుకోవడానికి వందలాది మంది జిల్లా ఆస్పత్రికి వచ్చారు. ముందుగా వీరికి ఆడియాలజిస్టుచే పరీక్షలు చేయాల్సి ఉంది. ఆడియాలజిస్టు పరీక్షలు చేసిన తర్వాత వైద్యులు పరీక్షలు నిర్వహిస్తాడు. జిల్లా ఆస్పత్రిలో ఒకరే ఆడియాజిస్టు ఉండటంతో పరీక్షలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు పరీక్షలు నిర్వహించినా చాలా మంది మిగిలిపోయారు. దీంతో వీళ్లందరూ 60-70 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారి గ్రామాలకు వెళ్లి మంగళవారం తిరిగి ఆస్పత్రికి వచ్చారు. ప్రతి రోజు ఒక్కో విభాగంలో 150-200 మందికి పరీక్షలు చేస్తున్నారు. ఇందుకు తగ్గట్లుగా వైద్యులు లేకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## క్లుప్తంగా

### మట్కా నిర్వాహకుల అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని దస్తగిరిపేటలో మట్కా నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో టూ టౌన్ సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో మోపూరి సుబ్బారెడ్డి, మారం జేమ్స్, వనిపెంట దస్తగిరి, మంజుల శంకర్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.12,150 నగదు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు

కలసపాడు : మండలంలోని బ్రాహ్మణపల్లె, చెన్నుపల్లె గ్రామాల మధ్యలో మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. బ్రాహ్మణపల్లెకు చెందిన అన్నారెడ్డి సాంబశివారెడ్డి తన పొలం వద్ద పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్న క్రమంలో కలసపాడు నుంచి చెన్నుపల్లెకు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొని సాంబశివారెడ్డికి ఎడమ కాలు విరిగింది. వెంటనే స్థానికులు కలసపాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లారు.

### గాయపడిన యువకుడి మృతి


శరత్‌కుమార్(ఫైల్)

బద్వేలు అర్బన్/గోపవరం : ఈ నెల 26న గోపవరం మండలం సుదర్శన ఆశ్రమం సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బద్వేలు శరత్‌కుమార్ (19) మంగళవారం మృతి చెందాడు. మున్సిపాలిటీ పరిధిలోని బంకపాలెం గ్రామానికి చెందిన వెంకటేశు, రాణెమ్మలకు ముగ్గురు సంతానం. నాలుగు నెలల క్రితం వెంకటేశు అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ పోషణ నిమిత్తం పెద్దకుమారుడైన శరత్‌కుమార్ శ్రీనివాసపురం వద్ద గల పెట్రోలు బంకులో పనిచేస్తుండేవాడు. భోజనం కోసం ఇంటికి వస్తున్న సమయంలో కడప డిపోకు చెందిన ఏపీ39 యూజీ 8250 నెంబరు గల అద్దె బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. నాలుగు నెలల క్రితం భర్తను, అంతలోనే ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడిని కోల్పోయిన రాణెమ్మ, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

# బాబు ప్రజలను మోసం చేశారు

**ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్: రాష్ట్ర ప్రజలు చంద్రబాబును నమ్మి అధికారమిస్తే ఆయన ఘోరంగా మోసం చేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని ఆయన నివాసంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు కూడా అట్టర్ ఫ్లాప్ అయ్యాయన్నారు. పథకాల అమలు చేయలేకున్నామని ఆయన చెప్పిన మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. పథకాలు అమలు చేస్తామని కోటిన్నర మంది మహిళలను ఆయన మోసం చేశారన్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు తెలియవా అని ప్రశ్నించారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్లు అప్పుల్లో ఉందని, చెప్పింది మీరు కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో గాడిన పెడతామన్నది మీరే. ఇచ్చిన హామీలను 95% అమలు చేసిన దమ్మున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని, దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం ప్రజా దర్బార్‌లో ఆయన సమస్యలు విని వినతి పత్రాలు తీసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, దశరథరామిరెడ్డి, రసూల్, గంగాధర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాబూ.. ఎన్నికల ముందు ఆర్థిక పరిస్థితి తెలియదా?

- అలవిగాని హామీలిచ్చి ఇప్పుడు చేతులెత్తేస్తావా!
- హామీల అమలుకు ప్రభుత్వ మెడలు వంచుతాం
- మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదు గనుక ఎన్నికల హామీలను నెరవేర్చలేమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడటం ఏరు దాటేంత వరకు ఓడమల్లన్న....దాటాక బోడి మల్లన్న అన్న సామెతను గుర్తు చేస్తోందని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామంటూ ప్రతి సభలో హామీ ఇచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినప్పటికీ తాము అధికారంలోకి వస్తే వాటిని తీర్చి వేయడంతోపాటు సంపద సృష్టించి హామీలు అమలు చేస్తామంటూ వాగ్దానం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా జగన్‌పై నిందలు వేయడం తప్ప ఒక్క హామీ కూడా నెరవేర్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. తనకు 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన అనుభవం ఉందంటూ చెప్పుకున్న చంద్రబాబుకు ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా? అంటూ ఆయన నిలదీశారు. అలవిగాని హామీలు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. 2014–19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా బాబు హామీలు అమలు చేయలేదని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణం చేసిన నాటికి రాష్ట్ర ఖజానాలో కేవలం రూ. 100 కోట్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు మొదటి నెల జీతాన్ని కూడా ఇవ్వలేరంటూ ఆనాడు మాజీ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడటమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. కరోనా కష్టకాలం వచ్చినప్పటికీ ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. దళారీలు, లంచాల బెడద లేకుండా యేటా రూ. 50 వేల కోట్లు సంక్షేమ పథకాలకు ఖర్చు చేశారన్నారు. గత జూన్‌లో చంద్రబాబు అధికారంలో వచ్చిన నాటికి రాష్ట్ర ఖజానాలో రూ. 8 వేల కోట్లు ఉండడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే హామీలు నెరవేర్చేందుకు మార్గాలు ఉంటాయని చెప్పారు. బాబు హామీలు నెరవేర్చాలంటే యేటా రూ. లక్షా 50 వేల కోట్లు అవసరం అవుతాయన్నారు. హామీల అమలుపై దృష్టి సారించకుండా ప్రజలపై 15 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపారని విమర్శించారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 40–50 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయన్నారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఆరోపించారు. హామీలు అమలు చేసేంతవరకు చంద్రబాబు ప్రభుత్వాన్ని మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు అజ్మతుల్లాఖాన్, షఫీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి తోటకృష్ణ, దాసరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

# ‘బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ’ ఇదేనా?

**కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి**

లింగాల : కూటమి ప్రభుత్వంపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీవ్రంగా విరుచుకుపడ్డారు. లింగాల మండలం చిన్నకుడాల గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ‘బాబు ష్యూరిటీ – భవిష్యత్ గ్యారంటీ’ అంటూ ప్రచారాలు నిర్వహించారని, సూపర్ సిక్స్ అంటూ రైతులు, మహిళలు, విద్యార్థులను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కుంటి సాకులు చెబుతున్నారని ఎంపీ తీవ్రంగా మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే సమయానికి రూ.5లక్షల కోట్ల అప్పులు, వంద కోట్లు మాత్రమే బడ్జెట్ ఉండేదని.. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశారన్నారు. కోవిడ్ సమయంలో రాష్ట్రానికి రాబడి తగ్గినప్పటికీ వెనుకకు తగ్గలేదన్నారు. చంద్రబాబు మాత్రం అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయలేనని చెబుతున్నారన్నారు. ప్రజలు వైఎస్ జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు తేడా గమనించాలని కోరారు. కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందులలో అధికార పార్టీ అండదండలతో జూదాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. జూదంతో పాటు చోరీలు కూడా పెరిగాయని, ఎంతోమంది రోడ్డున పడ్డారన్నారు. జూదాలు ఆడిస్తూ, అక్రమంగా ముగ్గురాళ్లను తరలిస్తూ అధికార కూటమి నాయకులు లక్షలకు లక్షలు డబ్బులు ఆర్జిస్తున్నారే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పులివెందుల ప్రాంతంలో లింగాల కుడికాలువ ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ధ్వంసంచేసి వాటిలో ఉన్న కాపర్ వైర్లను దొంగిలించారన్నారు. ప్రస్తుతం అరటి ధరలు ఆశాజనకంగా ఉండటంతో గుట్ట వారిపల్లెలకు, గ్రామాలకు భూగర్భజలాలు లేక రైతులు సాగునీరు కావాలని కోరుతున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను తయారు చేయించడానికి సుమారు రూ.8.50 లక్షలు ఖర్చు అవుతుందని, వాటి కోసం తాము కృషి చేశామని.. వాటి రిపేరు ఖర్చు అధికార పార్టీ బిల్లులు ఇవ్వకపోయినా తాము ఇస్తామని చెప్పి వాటిని తయారు చేయించామన్నారు. త్వరలోనే వెలిదండ్ల గ్రామ సమీపంలోని ఎత్తిపోతల పథకాలకు అమర్చి లోపట్నూతల, కోమన్నూతల, తాతిరెడ్డిపల్లె, ఎగువపల్లె, దిగువపల్లె, మురారిచింతల గ్రామాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు మహిళలు, రైతులు, ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, నాగేంద్రనాథరెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, పురుషోత్తమరెడ్డి, మల్లికేశ్వరరెడ్డి, వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరంలోని తిలక్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు నాయక్ (45) మంగళవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రిమ్స్ ఎస్ఐ జయరాముడు తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా తలుపుల మండలానికి చెందిన రామాంజనేయులు నాయక్ కార్పెంటర్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి అలవాటుపడి పనులకు వెళ్లకుండా ఇంటిలోనే ఉంటుండేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి లక్షుమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### విద్యార్థి చేయి విరగడంపై ఎంఈఓల విచారణ


చేయి విరిగిన విద్యార్థి శివరాం

ప్రొద్దుటూరు కల్చరల్ : వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చేయి విరిగిన సంఘటనపై ఎంఈఓలు మంగళవారం విచారణ జరిపారు. పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి శివరాం 23వ తేదీన నోటు పుస్తకం తీసుకురాలేదని సైన్స్ ఉపాధ్యాయుడు మురళీ చేయిచేసుకోవడంతో ఆ విద్యార్థి చేయి విరిగింది. దీనిపై విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఈఓ షంషుద్దీన్ విచారణకు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణిలు విద్యార్థి శివరాం, తండ్రి మహేష్‌లను విచారించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు ఓబులేసు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### పన్ను డబ్బులను స్వాహా చేసిన అధికారిణిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న వీరశేఖర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పన్ను డబ్బులను ప్రభుత్వానికి చెల్లించకుండా స్వాహా చేసిన కమర్షియల్ టాక్స్ అధికారిణి విజయలక్ష్మీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాత సీడ్స్ యజమాని జి.వీరశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015 జులై 10న వాహన తనిఖీలు నిర్వహించిన అప్పటి కడప సీటీఓ -2 నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలను తరలిస్తున్నట్లు గుర్తించి నాలుగు రెట్లు అధికంగా రూ.63,000 జరిమానా విధించారన్నారు. జరిమానాకు సంబంధించిన రశీదులను ఎన్నిసార్లు అడిగినా ఆమె ఇవ్వకపోవడంతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశానన్నారు. దీంతో ఆమె తనతోపాటు ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు తెలిసిందన్నారు. ప్రభుత్వానికి దక్కాల్సిన డబ్బును స్వాహా చేసిన ఆ అధికారిణి ప్రస్తుతం తిరుపతిలో విధులు నిర్వహిస్తున్నారని ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి, ఏసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

### వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు


వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్

చింతకొమ్మదిన్నె : జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ–కమ్–సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ స్థానిక ఇందిరానగర్‌లోని పద్మావతి వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత కల్పించాల్సిన వృద్ధులను విడిచిపెట్టినా, పరిత్యాగం చేసే విధంగా బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా అలాంటి వారు శిక్షార్హులన్నారు. శిక్షాకాలం గరిష్టంగా మూడు నెలలు జైలు శిక్ష లేదా అపరాధ రుసుము గరిష్టంగా ఐదు వేల రూపాయలు లేదా రెండింటినీ కలిపి విధించవచ్చన్నారు ఈ కార్యక్రమంలో పద్మావతి వెంకటేశ్వర వృద్ధాశ్రమం నిర్వాహకులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు కోసం వాగ్వాదం

సుండుపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు నుంచి కూటమి నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలు తలెత్తుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వా రా రూ. 1.50 కోట్లు మంజూరయ్యాయి. కూటమి నేత ల మధ్య వర్గ విభేదాల కారణంగా సీసీ రోడ్ల పనులు తమకు కావాలని ఒక వర్గం వారు, లేదు తమకు కా వాలని మరో వర్గం వారు పట్టుబట్టడంతో మండలం ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు.

# పోలీసు వాహనాల నిర్వహణ కీలకం

**ఎం.టి. విభాగ డ్రైవర్ల అవగాహన కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు**



పోలీస్ వాహన డ్రైవర్లతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)కె. ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : పోలీస్ శాఖ గౌరవం ప్రతిష్ఠ పెంచే విధంగా పోలీసుల వాహనాల నిర్వహణ ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు సూచించారు. డ్రైవర్లు మరింత క్రమశిక్షణతో విధి నిర్వహణ చేయాలన్నారు. జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మొబిలైజేషన్‌లో భాగంగా ఎం.టి. విభాగ పోలీసు వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) మాట్లాడుతూ డ్రైవర్లందరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పోలీస్ శాఖ గౌరవం మీ చేతుల్లో ఉందనే విషయం గుర్తుంచుకుని, క్రమశిక్షణతో విధి నిర్వహణ చేస్తూ వాహనాల నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. అతివేగంతో వెళ్లకూడదని, ప్రతి ఒక్కరూ వాహనాన్ని తమ సొంత వాహనంలాగా చూసుకుంటూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఘటనా స్థలానికి వెళ్లే సమయంలోనూ వాహన సామర్థ్యానికి అనుగుణంగా వాహనాలను నడపాలని, నిర్దేశించిన వేగం మించకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు, వేగపరిమితి, ఇతర నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య మాట్లాడుతూ హైవేల మీద ప్రయాణం చేసే సమయంలో వేగపరిమితిని విధిగా పాటించాలన్నారు. వాహనాల ఇంజన్ ఆయిల్, బ్రేక్, క్లచ్ ఆయిల్స్, కూలెంట్ ఆయిల్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించి వాహనాల జీవిత కాలాన్ని పెంచేలా చూసుకోవాలని సూచించారు. ఏ.ఆర్. డీఎస్పీ శ్రీనివాసరావు, ఎం.టి. విభాగ ఆర్.ఐ వీరేష్, ట్రాఫిక్ సీఐ జావేద్, ఎం.వి ఐ.ప్రసాద్, మహీంద్రా ఆటోమొబైల్స్ కంపెనీ సిబ్బంది, పోలీస్ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

# కోర్టు స్టే ఉన్నా తొలగించాలంటున్నారు


మాట్లాడుతున్న సిండికేట్ ప్లానర్స్ ఇంజినీర్ కుప్పం పుల్లయ్య

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద తన మూడు షాపింగ్ గదులకు సంబంధించి స్టే ఆర్డర్ ఉన్నా రాజకీయ పలుకుబడితో కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తన గదులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని సిండికేట్ ప్లానర్స్ ఇంజినీర్ కుప్పం పుల్లయ్య తెలిపారు. తన షాపింగ్ గదులను జేసీబీతో తొలగిస్తున్నారని, మంగళవారం వేకువ జామునే షాపింగ్ గదుల వద్దకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం తన స్థలం తీసుకోవాలని ల్యాండ్ అక్విజేషన్‌కు పూనుకుందన్నారు. దీనిపై తాను కోర్టుకు వెళ్లి 2009 మే 1న స్టే ఆర్డర్ తెచ్చుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు స్టే ఆర్డర్ కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం కాలువ నిర్మాణం కోసం సర్పంచ్ శివచంద్రారెడ్డి తన గదులను తొలగించాలని చూస్తున్నారన్నారు. ఈ విషయంపై తాను ప్రశ్నించగా ఆయన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి వద్దకు తీసుకెళ్లారన్నారు. అక్కడ తాను ఇదే విషయాన్ని తెలిపానని, తహసీల్దార్‌తో సర్వే చేయించాలని ఎమ్మెల్యే తెలిపారన్నారు. ఈ లోగానే తన పక్కన కోర్టు స్టే ఉన్న మరో గదిని జేసీబీతో తొలగింపజేశారన్నారు. ఈ సమావేశంలో ఆయన కుమారుడు ప్రదీప్ పాల్గొన్నారు.

# పంజాబ్ జట్టు ఘన విజయం


తలపడుతున్న ఆంధ్రా, పంజాబ్ జట్లు


జశ్‌కరణ్‌వీరక్షసింగ్‌పాల్ (73 పరుగులు)


ఉదయ్ శరణ్ (71 పరుగులు)

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన కల్నల్ సీకే నాయుడు అండర్–23 అంతర్ రాష్ట్రాల మ్యాచ్‌లో పంజాబ్ జట్టు విజయం సాధించింది. నాలుగోరోజు మంగళవారం 255 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ జట్టు 83.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. జట్టులోని జశ్‌కరణ్‌వీర్ సింగ్ పాల్ 73, ఉదయ్ శరణ్ 71, రాహుల్ కుమార్ 56 పరుగులు చేశారు. దీంతో పంజాబ్ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 162 పరుగులు చేసింది. అలాగే పంజాబ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 119 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

### ఆగి ఉన్న లారీ చోరీ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని కుక్కలదొడ్డి వద్ద హైదరాబాదు నుంచి తిరుపతికి ఐరన్ లోడుతో వెళ్తున్న 12 చక్రాల లారీని ఆపి డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకుంటుండగా మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్ బి.వెంకట రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నవీన్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

### రైతుల ఆత్మహత్యలపై ఆర్డీఓ విచారణ


రైతు ఆత్మహత్యపై వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ, రెవెన్యూ అధికారులు

వేంపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడంతో వారి ఆర్థిక పరిస్థితిపైన పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య విచారణ చేపట్టారు. మంగళవారం మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఎద్దుల సాంబశివారెడ్డి, రామిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీనువాసులరెడ్డి, వేంపల్లెలోని క్రిష్టియన్ కాలనీలో గూడూరు ఆశీర్వాదం అనే రైతులు ఇటీవల అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గత రెండేళ్లుగా వేసిన పంటలకు దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలకు పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ హరినాథ్ రెడ్డిలు వెళ్లి రైతు కుటుంబ సభ్యులతో, గ్రామస్తులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అలాగే వారి ఆర్థిక పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, వీఆర్ఓ డి.ఓబయ్య, టీడీపీ నేతలు జగన్నాథరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు, జరిమానా

సిద్దవటం : సిద్దవటం మండలం మంగనవాండ్లపల్లె గ్రామంలో 2013లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 1000 జరిమానా విధిస్తూ బద్వేల్ అడిషనల్ అసిస్టెంటు సెషన్స్ జడ్జి వై.జె.పద్మశ్రీ తీర్పు ఇచ్చినట్లు సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సిద్దవటం మండలం మంగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన నారపురెడ్డి యానాదిరెడ్డి, అతి తమ్ముడు ఎల్లారెడ్డి కలిసి వారి పొలంలో వేరుశనగ పంట వేసుకున్నారు. అయితే అంత్యం సుబ్బయ్య, అంత్యం సురేష్‌కర్ణ అలియాస్ సురేష్‌కు చెందిన ఆవులు, ఎనుములు వారి పొలంలో పడి మేశాయి. దీంతో ఎల్లారెడ్డి సుబ్బయ్య వద్దకు వెళ్లి ఆవులు, ఎనుములు తన పొలంలో పడి మేస్తున్నాయని చెప్పాడు. దీంతో సుబ్బయ్య ఎల్లారెడ్డిపై కత్తితో దాడిచేశాడు. అంతలోనే సుబ్బయ్య చేతిలో ఉన్న కత్తిని సురేష్ కర్ణ లాక్కొని ఎల్లారెడ్డిని పొడవడంతో తీవ్ర రక్తగాయమైంది. బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. ఈ సంఘటనపై అప్పటి హెడ్ కానిస్టేబుల్ పి. దస్తగిరి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్. గురునాథ్ విచారణ చేపట్టారు. ప్రస్తుత సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచారు. దీంతో మంగళవారం బద్వేలు అడిషనల్ అసిస్టెంటు సెషన్స్ కోర్టు జడ్జి వై.జె. పద్మశ్రీ విచారణ జరిపి నేరం రుజువు కావడంతో ఈ కేసులోని ఇద్దరు ముద్దాయిలకు ఒక్కొక్కరికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష అలాగే ఒక్కొక్కరికి రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.